క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

వీరులపాడు: మండలంలోని జుజ్జూరు గ్రామంలో అంగనవాడీ కేంద్రం–6లో ఖాళీగా ఉన్న సహాయకురాలు (బీసీ–ఈ) పోస్టుకు అర్హత గల వారు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీవో భాగ్యరేణుక సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు దారులు ఈనెల ఐదో తేదీ సాయంత్రం ఐదు గంటల్లోగా దరఖాస్తులను అందజేయాలన్నారు. అంతే కాకుండా పదవ తరగతి ఉత్తీర్ణులైన బీసీ మైనార్టీకు చెందిన వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. పూర్తి వివరాలకు కార్యాలయ పని వేళల్లో సంప్రదించాలని సూచించారు.

పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోండి



జగ్గయ్యపేట అర్బన్: కృష్ణా–గుంటూరు జిల్లాలోని పట్టభద్రులందరూ ఈనెల ఆరో తేదీలోపు ఓటు నమోదు చేసుకోవాలని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) పిలుపునిచ్చారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం పక్కన ఉన్న మెప్మా కార్యాలయంలో ఎమ్మెల్సీ ఎన్నికలు–ఓటు ఎలా నమోదు చేసుకోవాలి అనే అంశంపై ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పట్టభద్రులు ఫారం –18 పూర్తి చేసి ఏదైనా డిగ్రీ ప్రొవిజినల్ సర్టిఫికెట్ జిరాక్స్ కాపీపై గెజిటెడ్ ఆఫీసర్‌తో సంతకం చేయించి జత పరచాలన్నారు. అలాగే ఆధార్, ఓటరు ఐడీ కార్డు జిరాక్స్ కాపీలను కూడా జత చేయాలని సూచించారు. టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి మైనేని రాధా, మండల అధ్యక్షుడు కట్టా నరసింహారావు, పట్టణ సమాఖ్య అధ్యక్షురాలు షేక్ నజీమున్, నాయకుడు గెల్లా వైకుంతేశ్వరరావు, మెప్మా ఆర్పీలు, సీవోలు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

జగ్గయ్యపేట అర్బన్: అనారోగ్యానికి గురైన పేద వారికి ప్రభుత్వం అందజేస్తున్న ముఖ్యమంత్రి సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) సూచించారు. పట్టణంలోని రంగ స్వామి బజారుకు చెందిన బిల్లకంటి కార్తీక్ అనారోగ్యానికి గురికావడంతో విజయవాడలోని హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. దీంతో ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ముందస్తు వైద్య ఖర్చుల నిమిత్తం ఎల్‌ఓసీ రూ. 5.50 లక్షలు మంజూరు చేయించారు. ఈ సందర్భంగా సోమవారం ఎమ్మెల్యే నివాసంలో బాధిత కుటుంబ సభ్యులకు ఎల్‌ఓసీ మంజూరు పత్రాన్ని అందజేశారు.

ఆర్థిక సాయం అందజేత

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని క్రిస్టియన్ పేటకు చెందిన కాకాని వెంకటేశ్వర్లుకు షుగర్ వ్యాధి కారణంగా ఒక కాలును తొలగించారు. అంతేకాకుండా ఇటీవల అతనికి గుండెపోటు కూడా వచ్చింది. దీంతో అసలే పేదరికంలో ఉన్న ఆ కుటుంబం మరింతగా ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయింది. విషయం తెలుసుకున్న మహిమ ఫౌండేషన్ వారు సోమవారం ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం రూ. ఎనిమిది వేలు అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ నిర్వాహకుడు సురేష్, సభ్యులు మేజర్ శివాజీ, గుర్రాల గోపి, ఆవుల రామకృష్ణ, ఇనపనూరి వైశ్యారాణి, ఏపీ గురుకులాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ కుక్కల వెంకటేష్ బాధితుడికి ఆర్థిక సాయం అందజేశారు.

యూకో బ్యాంకు నూతన బ్రాంచ్ ప్రారంభం



నందిగామ టౌన్: నందిగామ పరిసర ప్రాంత ప్రజలు యూకో బ్యాంకు సేవలను వినియోగించుకోవాలని బ్రాంచ్ మేనేజర్ గోపి కోరారు. పట్టణంలోని ఎంఎస్ భవనంలో నూతనంగా ఏర్పాటు చేసిన యూకో బ్యాంకు నూతన బ్రాంచ్‌ను సోమవారం బ్యాంకు మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో అశ్వనీకుమార్ వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా మేనేజర్ గోపి మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన సేవలందించడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా అతి తక్కువ వడ్డీకే అన్ని రకాల రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆయా శాఖల ప్రతినిధులు శ్రీకాంత్, శశిభూషణ్, జగదీష్, ఇలియాస్ బాష, కీర్తి, పట్టణ ప్రముఖులు షేక్ కరీముల్లా, షేక్ యాకుబ్ అలీ, షేక్ మున్నా తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ స్వయంభు శంభులింగేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి సోమవారం గ్రామానికే చెందిన గింజుపల్లి సురేష్, లక్ష్మీప్రసన్న దంపతులు రూ. 10,116లు ఆలయ నిర్మాణ కమిటీ నిర్వాహకుడు వాసిరెడ్డి బెనర్జీకి అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు రేలంకి భాస్కరశర్మ దాతలకు తీర్థప్రసాదాలు అందజేశారు.

హడలెత్తిస్తున్న గ్రామ సింహాలు

- భయం.. భయంగా రోడ్డెక్కాల్సిందే
- వెంటాడి మరీ గాయపరుస్తున్న వైనం
- పట్టించుకోని అధికారులు.. ఆందోళనలో ప్రజలు



బండిపాలెంలో గుంపులుగా తిరుగుతున్న వీధి కుక్కలు

జగ్గయ్యపేట అర్బన్/జగ్గయ్యపేట: పట్టణాలు, గ్రామీణ ప్రాంతాలు అనే తేడా లేకుండా ప్రజలను గ్రామ సింహాలు హడలెత్తిస్తున్నాయి. కర్ర చేతిలో లేనిదే బయటకు రాలేని దుస్థితి నెలకొంది. వీధికి 10 నుంచి 15 వరకు కుక్కలు ఉంటున్నాయి. చిన్న పిల్లలు, బాటసారులను వెంటాడి మరీ దాడి చేస్తున్నాయి. మనుషుల పైనే కాకుండా పశువులు, మేకలు, గొర్రె పిల్లలపై కూడా విరుచుకుపడుతున్నాయి. ద్విచక్ర వాహనాదారులను మరీ దారుణంగా వెంటాడి గాయాలపాలు చేస్తున్నాయి. ఇక రాత్రి వేళల్లో ప్రయాణం మరింత భయానకంగా ఉంటుందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రేయింబవళ్లు వీధుల వెంట తిరుగుతూ కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయని వాపోతున్నారు.

నెలకు 100కు పైగానే కేసులు

జగ్గయ్యపేట మున్సిపాలిటీ పరిధిలో నెలకు 100కు పైగా కుక్కకాటు కేసులు నమోదవుతున్నాయి. నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వాస్పత్రుల్లో జనవరి నుంచి ఇప్పటి వరకు 1,472 కుక్క కాటుకు వ్యాక్సిన్లు అందించారు. పేట పట్టణంలో మాత్రం గత మూడు నెలలుగా నెలకు 120 నుంచి 150 చొప్పున వ్యాక్సిన్లు అందించగా, మే నెలలో మాత్రం 176 వ్యాక్సిన్లు వేశారు.

గొర్రెలు, మేకలపై కూడా దాడులు

పట్టణంలోని యాదవ బజారు, మిట్టగూడెంలలో 20కు పైగానే మేకలు, గొర్రెలు గత రెండు మూడు నెలల్లో మృత్యువాత పడ్డాయి. రాత్రి వేళల్లో కుక్కలు గుంపులుగా మేకలు, గొర్రెలను పెంచే గృహాల్లోకి చొరబడి వాటిని గాయపరుస్తున్నాయి. మేక, గొర్రె పిల్లలను ఎత్తుకుపోతున్నాయి. అలాగే వీధికుక్కలు వాహనాలను వెంబడిస్తూ గాయపరుస్తున్నాయని వాహనదారులు సైతం వాపోతున్నారు.

కూడళ్లే వాటికి అడ్డాలు

వందల సంఖ్యలో కుక్కలు ప్రధాన కూడళ్లలో, మాంసం, చేపల విక్రయ కేంద్రాలు, పెద్ద పెద్ద హోటళ్ల వద్ద తిష్ట వేస్తున్నాయి. 15 నుంచి 20 కుక్కల వరకు గుంపులుగా తిరుగుతుండటంతో జనం అటువైపు వెళ్లడానికి జంకుతున్నారు. వాహనాల వెంబడి పరుగులు తీస్తూ వాహనదారులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి.

పట్టించుకోని అధికారులు

వీధి కుక్కలు స్వైర విహారం చేస్తూ దాడులకు పాల్పడుతున్నాయని అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే పరిస్థితేంటని ప్రశ్నిస్తున్నారు. ప్రమాదాలు జరిగిన సమయంలో హడావుడి చేయడం ఆ తర్వాత నిమ్మకుండిపోవడం అధికారులకు పరిపాటిగా మారిందని చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం



వీధి కుక్కలను పట్టి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసేందుకు తిరుపతిలోని యానిమల్ కేర్ సెంటర్ వారికి లెటర్ పెట్టాం. అలాగే విజయవాడ నగర కార్పొరేషన్ వారిని కూడా సంప్రదించాం. అంతేకాక వాటిని పట్టి దూరంగా అడవుల్లో విడిచిపెట్టే వారి కోసం కుక్కకు ఇంత అని అమౌంట్ ఇచ్చేందుకు టెండర్ల కోసం ప్రయత్నిస్తున్నాం.

ఎం. రామ్మోహనరావు, మున్సిపల్ కమిషనర్, జగ్గయ్యపేట

వాహనాలను వెంబడిస్తున్నాయి



కుక్కలు రాత్రి వేళల్లో వచ్చే ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లను వెంబడిస్తున్నాయి. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారుల ప్రయాణం భయానకంగా మారింది. కుక్కలు వెంబడిస్తుండటంతో ద్విచక్ర వాహనదారులు కిందపడి ఆస్పత్రుల పాలైన ఘటనలు అనేకం ఉన్నాయి.

– కొల్లా ప్రసాద్, షేర్‌మహ్మద్‌పేట

వెంట పడి గాయపరిచాయి



బైకుపై వెళుతుంటే కుక్కలు నా వెంట పడి గాయపరిచాయి. పిల్లలు స్కూలుకు వెళుతుంటే వెంటపడి కరుస్తున్నాయి. ఎప్పుడు ఏ కుక్క పిల్లలపై దాడి చేస్తుందోనని భయంతో వణికిపోతున్నాం. పిల్లల వెంట తల్లిదండ్రులు వెళ్లి తీసుకురావాల్సిన పరిస్థితి ఏర్పడింది. అధికారులు కుక్కల నివారణకు చర్యలు చేపట్టాలి.

– తూములూరి అశోక్, బాధితుడు, ఎర్రయ్యగారి బజారు

జీవాలపై దాడులు



ఎన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నా గొర్రెలు, మేకలు, కోళ్లపై కుక్కల దాడులు చేస్తున్నాయి. ఒక్క మిట్టగూడెంలోనే గత రెండు నెలల్లో గొర్రెలు, మేకల మృతితో రూ. 40 నుంచి 50 వేల వరకు నష్టపోయారు. పసి పిల్లలను కూడా చూస్తే దాడి చేయకుండా ఉండటం లేదు. అధికారులు యుద్ధ ప్రాతిపదికన వాటి సమస్యను తొలగించాలి.

గోగుల వెంకయ్య, ఇందిరా కాలనీ, జగ్గయ్యపేట

ఎనిమిది ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

కంచికచర్ల: అధికారుల అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలించినా, రీచ్‌ల్లో కాకుండా ఇతర ప్రదేశాల్లో తవ్వకాలు జరిపినా కేసు నమోదు చేస్తామని అవసరమైతే వాహనాలను సీజ్ చేస్తామని తహసీల్దార్ వి. జాహ్నవి హెచ్చరించారు. మండలంలోని కీసర మున్నేరు బ్రిడ్జి కింద అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తవ్వకాలు జరిపి తరలిస్తున్న ఎనిమిది ట్రాక్టర్లను సోమవారం పట్టుకున్నారు. పట్టుకున్న ట్రాక్టర్లను తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. ఈ మేరకు తహసీల్దార్ మాట్లాడుతూ అధికారుల అనుమతులు లేకుండా మున్నేరు బ్రిడ్జి కింద ఇసుకను తవ్వకాలు జరిపితే సహించేది లేదన్నారు. పట్టుకున్న ట్రాక్టర్లను మైనింగ్‌శాఖ అధికారులకు అప్పగించడం జరుగుతుందని పేర్కొన్నారు.

రీసర్వేపై గ్రామ సభ



గ్రామసభలో రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

కెఅగ్రహారం(జగ్గయ్యపేట): గ్రామంలోని సచివాలయంలో సోమవారం రీసర్వే గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల సర్వేయర్ అనూష్‌బాబు మాట్లాడుతూ గత 10 రోజులుగా గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించామన్నారు. పలు గ్రామాలకు చెందిన ప్రజలు అడంగల్‌లో తప్పులు, గట్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అర్జీలు అందించారని తెలిపారు. గ్రామంలో ఏడుగురు రైతులు దరఖాస్తులు అందజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్వేయర్‌లు కృష్ణవేణి, మదార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘ కార్యవర్గ ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న మండల ఆర్యవైశ్య సంఘ సభ్యులు

నందిగామ టౌన్: పట్టణంలోని శ్రీనివాస ఆర్యవైశ్య కల్యాణ మండపంలో సోమవారం ఆర్యవైశ్య సంఘ మండల కార్యవర్గ ప్రమాణ స్వీకారం నిర్వహించారు. ముందుగా వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి నివాళులర్పించారు. సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారులు చవట నాగేశ్వరరావు, పబ్బతి సీతారామగుప్త, మహంకాళి చంద్రశేఖర్‌లు నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మాట్లాడుతూ నూతన కార్యవర్గం సంఘ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. సంఘ సభ్యులు చల్లా అనిల్, ఏచూరు రాము, ఊటుకూరు సత్యనారాయణ, పబ్బతి రాజేష్, అనుమోలు పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడి సాయాన్ని తక్షణమే అందించాలి



వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

నందిగామ టౌన్: ఎన్నికలకు ముందు కూటమి నేతలు ఇచ్చిన హామీ మేరకు రైతులకు పెట్టుబడి ఖర్చుల నిమిత్తం ఇస్తామన్న రూ. 20వేలను తక్షణమే అందించాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి చుండూరు సుబ్బారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన మండలంలోని రామిరెడ్డిపల్లి గ్రామ సచివాలయ కార్యదర్శికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీ సీజన్ సైతం ప్రారంభమవుతోందని ప్రభుత్వం తక్షణమే స్పందించి రైతులకు ఇస్తామన్న పెట్టుబడి సాయం అందించి వారిని ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతు నాయకులు కట్టా చామంతి, వీరమాచినేని నాగమల్లి, వీరమాచినేని కృష్ణ, వెలిశాల రామకృష్ణ, నరసింహారావు, చిన్నబ్బాయ్, ఏసు, పలువురు రైతులు పాల్గొన్నారు.

పశు సంపద అభివృద్ధే లక్ష్యం



మాట్లాడుతున్న చలసాని

మల్కాపురం(జగ్గయ్యపేట): పశు సంపద అభివృద్ధే కృష్ణామిల్క్ యూనియన్ లక్ష్యమని యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు పేర్కొన్నారు. గ్రామంలోని పాల సేకరణ కేంద్రం వద్ద సహకార సంఘాల పాడి రైతులతో సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశు సంపద అభివృద్ధికి అన్ని గ్రామాల్లో పాల సహకార సంఘాల ఆధ్వర్యాన యూనియన్ తీసుకున్న నిర్ణయాలపై అవగాహన కలిగిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా మేలు జాతి సెమెన్ మార్కెట్‌లో రూ. 350లు ఉండగా యూనియన్ రైతులకు రూ. 50లకే అందిస్తున్నట్లు తెలిపారు. దీంతో మంచి పాడి పశువులను అభివృద్ధి చేయవచ్చని తెలిపారు. ఇందుకు ఏడాదికి రూ. రెండు కోట్లు ఖర్చు చేస్తున్నామని చెప్పారు. అనంతరం పాడి పశుపోషణలో పలు సూచనలు, సలహాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో యూనియన్ సభ్యులు చెరుకూరి లవయ్య, ఇంజం రామారావు, క్లస్టర్ మేనేజర్ రమేష్, సూపర్‌వైజర్ కెవి. రమణ, సంఘ అధ్యక్షుడు చావా వీరమాత, శ్రీనివాసరావు, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆగని ఇసుక మాఫియా

అక్రమార్కులకు కాసుల వర్షం



పెనుగంచిప్రోలు మునేరులో ఇసుక లోడింగ్ అవుతున్న ట్రాక్టర్లు

పెనుగంచిప్రోలు: ఉచిత ఇసుక పథకం అక్రమార్కులకు కాసుల వర్షం కురిపిస్తోంది. స్థానికంగా నిర్మాణ అవసరాలకు బండ్లు, ట్రాక్టర్ల ద్వారా ఇసుక ఉచితంగా రవాణా చేసుకోవచ్చని ప్రభుత్వం తెలిపింది. అయితే దీనినే అదునుగా చేసుకుని కొందరు కూటమి నాయకులు ట్రాక్టర్ల ద్వారా ఇష్టమొచ్చిన రీతిలో ఇసుక రవాణా చేస్తున్నారు. పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు పదుల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా ఇసుక రవాణా జరుగుతున్నా అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. అసలు నిర్మాణాలు ఎన్ని జరుగుతున్నాయి, ఎన్ని ట్రాక్టర్ల ఇసుక తోలుతున్నారో అర్థం కావడం లేదు. కేవలం ఇసుక తోలకాల కోసమే గ్రామాల్లో పదుల సంఖ్యలో కొత్తగా ట్రాక్టర్లు కొన్నవారు కూడా ఉన్నారు. దీనిని బట్టి ఇసుక తవ్వకాల ప్రభావం ఏ మేరకు ఉందో అర్థం చేసుకోవచ్చు.

కొనసాగుతున్న డంప్‌లు

పలు చోట్ల డంప్‌లు స్వాధీనం చేసుకుంటున్నా ఇంకా ఇసుక డంప్‌లు కొనసాగుతూనే ఉన్నాయి. తోటచర్ల గ్రామంలో ఇసుక డంప్‌లను అధికారులు స్వాధీనం చేసుకోవడంతో నవాబుపేట గ్రామంలో రహస్యంగా జాతీయ రహదారి పక్కన మనుగడలో లేని రోడ్డులో డంప్ చేసి అక్రమంగా తరలిస్తున్నారు. అలాగే ముండ్లపాడు, పెనుగంచిప్రోలు తదితర గ్రామాలతో పాటు వత్సవాయి మండలం భీమవరం, మక్కపేట, శింగవరం గ్రామాల్లో డంప్‌లు ఉన్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. అక్రమార్కుల చర్యలతో ఉచిత ఇసుక పథకం ఆచరణలో శూన్యమవుతోంది.

భక్తులతో కిక్కిరిసిన శివాలయాలు



పెనుగంచిప్రోలు శివాలయంలో వేకువజామున దీపాలు వెలిగిస్తున్న మహిళలు



దాములూరు కూడలి సంగమేశ్వరస్వామి



కంచికచర్ల పాత శివాలయంలో స్వామివారు



మంగొల్లులో స్వామివారికి ప్రత్యేక అలంకరణ



తిరుమలగిరి శివాలయంలో స్వామివారు

పెనుగంచిప్రోలు: పవిత్ర కార్తిక మాస మొదటి సోమవారం సందర్భంగా శివాలయాలు భక్తులతో కిక్కిరిసాయి. ఆలయాల చుట్టూ భక్తులు క్యూ కట్టారు. గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ స్వయంభూ శంభులింగేశ్వరస్వామి ఆలయంలో భక్తులు పెద్ద సంఖ్యలో వేకువజాము నుంచే దీపాలు వెలిగించి స్వామివారు, అమ్మవార్లను దర్శించుకున్నారు.

వత్సవాయి: మండలంలోని శివాలయాలు సోమవారం భక్తులతో కిటకిటలాడాయి. కార్తిక మాస మొదటి సామవారం కావడంతో భక్తులు పెద్దసంఖ్యలో స్వామివార్లను దర్శించుకుని పూజలు చేశారు. లింగాల వద్ద మునేటిలో స్నానాలు చేసి పక్కనే ఉన్న శ్రీ రామలింగేశ్వరుని దర్శించుకున్నారు. అదేవిధంగా వత్సవాయి, పోలంపల్లి, కంభంపాడు, మక్కపేట, భీమవరం, మంగొల్లు, గోపినేనిపాలెం గ్రామాల్లోని శివాలయాల వద్ద భక్తులు పూజలు చేసి దీపాలు వెలిగించారు.

నందిగామ టౌన్: నందిగామ పట్టణంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లోని శివాలయాలు సోమవారం శివనామ స్మరణతో మార్మోగాయి. పట్టణంలోని రామలింగేశ్వరస్వామి, మండలంలోని దాములూరు కూడలి సంగమేశ్వరస్వామి, గోళ్లమూడి శంభులింగేశ్వరస్వామి, రాఘవాపురం, పల్లగిరి గ్రామాల్లోని శివాలయాల్లో అర్చకులు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. అనంతరం మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, బిల్వపుష్ప అష్టోత్తర సహస్రనామ పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆయా ఆలయాల్లో భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

కంచికచర్ల: కార్తిక సోమవారం సందర్భంగా స్థానిక పాత శివాలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామివారికి నీరాజన మంత్ర పుష్పములు, మహన్యాసపూర్వక అభిషేకాలు, అష్టోత్తర పూజలు చేశారు. స్థానిక మహాలక్ష్మీ అమ్మవారి ఆలయం, వాసవీకన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు జరిగాయి. మండలంలోని పరిటాల, గండేపల్లి, చెవిటికల్లు, మోగులూరు, గనిఆత్కూరు తదితర గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు స్వామివార్లకు విశేష పూజలు చేశారు.

జగ్గయ్యపేట: మండలంలోని ముక్త్యాల గ్రామంలో భవానీ ముక్తేశ్వరస్వామి ఆలయంలోని స్వామివారికి, సమీపంలోని కోటిలింగ మహాక్షేత్రంలో పంచముఖ అమృత లింగేశ్వరునికి సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా తిరుమలగిరి గ్రామంలోని కొండపైనున్న శివాలయంలో స్వామివారిని లక్ష బిళ్వాలతో ప్రత్యేకంగా అలంకరించారు. కోటి లింగాలలో భక్తులు బాణవాయు శివలింగాలను ప్రతిష్ఠించారు. అనుమంచిపల్లి శివాలయంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు.

నేడు విద్యుత్ చార్జీల పెంపుపై ధర్నా

జగ్గయ్యపేట అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ట్రూఅప్ పేరిట విద్యుత్ చార్జీల పెంపుదలను నిరసిస్తూ సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని ఆర్టీసీ డిపో వద్ద ఉన్న విద్యుత్‌శాఖ ఏడీఈ కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమం చేపట్టినట్లు ఆ పార్టీ నియోజకవర్గ కార్యదర్శి ఎ.శివాజి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30కు జరిగే ఈ ధర్నాలో విద్యుత్ వినియోగదారులంతా పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నాగుల చవితికి శ్రీనాగలక్ష్మి ఆలయం ముస్తాబు



విద్యుత్ దీపాలంకరణలో ఆలయం

జగ్గయ్యపేట అర్బన్: నాగుల చవితి పండుగ సందర్భంగా పట్టణంలోని విద్యానగర్‌లో వేంచేసియున్న స్వయంభూ శ్రీనాగలక్ష్మి అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. నాగుల చవితి మంగళవారం కావడంతో ఆలయ కమిటీ వారు దేవాలయాన్ని, ప్రాంగణాన్ని ముస్తాబు చేశారు.

సచివాలయ సిబ్బందికి శిక్షణ



శిక్షణలో పాల్గొన్న సచివాలయ కార్యదర్శులు

పెనుగంచిప్రోలు: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సోమవారం స్కిల్ సెన్సెస్‌పై మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ జి. శ్రీనుతోపాటు శిక్షకులు ఎం. కిషోర్, జి. ప్రసన్నకుమార్ తదితరులు సెన్సెస్ ఎలా నిర్వహించాలో వివరించారు. కార్యక్రమంలో ఏఓ సిద్ధారెడ్డి, ఈవోపీఆర్డీ శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.